# ఎగిరే పళ్ళెములు అంటే ఏమిటి?

కొన్ని దేశాలలో ఫ్లయింగ్ సాసర్స్‌ను చూచామనీ, అవి తమ ప్రాంతములో ఆకాశమందు కనిపించాయనీ చాలామంది చెప్పగా విన్నాము. ఇంకా కొంతమంది ఫ్లయింగ్ సాసర్స్ దిగడము చూచామనీ, అందులో నుండి ఏలియన్స్ దిగినారని చెప్పుచుందురు. అలా వారు చెప్పుమాటలు నిజమేనా అని చూస్తే ఫ్లయింగ్ సాసర్స్‌కు, ఏలియన్స్‌కు ఏమాత్రము సంబంధము లేదు. ఫ్లయింగ్ సాసర్స్‌వేరు, ఏలియన్స్ వేరని తెలియుచున్నది. ఫ్లయింగ్ సాసర్స్ ఉన్నమాట నిజమే, అలాగే ఏలియన్స్ మాట నిజమే. అయితే ఫ్లయింగ్ సాసర్స్‌లో ఏలియన్స్ వచ్చారనుమాట పూర్తి అసత్యము. ఫ్లయింగ్ సాసర్స్ అనేక దేశాలలో చూచి అవి గ్రహాంతరవాసుల (ఏలియన్స్) యొక్క వాహనాలు అనుకోవడము జరిగినది. వాస్తవానికి అవి వాహనములు కావు. ఖగోళములో కొన్ని కోట్ల సంఖ్యలో చిన్నచిన్న గ్రహములు కలవు. చిన్న గ్రహములు కూడా స్థూలముగా ఎట్లుండినా, ఏ ఆకారముతో ఉండినా సూక్ష్మముగా సజీవమైనవేనని ముందే చెప్పుకొన్నాము. సజీవమైన చిన్న గ్రహములు కూడా దేవుని పాలనలో భాగస్వాములై ఉన్నాయని కూడా చెప్పుకొన్నాము. అటువంటి స్వల్ప గ్రహములలో ఒకరకమైనవి ఫ్లయింగ్ సాసర్స్ అనునవి. ఫ్లయింగ్ సాసర్స్ (ఎగిరే పళ్ళెములు) నిత్యమూ భూమి మీదకు వచ్చిపోతూవున్నవి. నిత్యమూ వచ్చి పోతున్నప్పటికీ బహు అరుదుగా మనుషులకు కనిపించి ఉండవచ్చును. వాటి ఉనికి మానవులకు తెలియుట కొరకు అలా ఎప్పుడైనా కనిపించి ఉండవచ్చును. మనుషులకు పునర్జన్మలు ఉన్నాయి, అయినా అవి ఎవరికీ తెలియవు. అవి ఉన్నాయని తెలియుటకు ఎక్కడో ఒకచోట, ఎవరికో ఒకరికి పునర్జన్మ జ్ఞప్తి వచ్చుచున్నది. అలా పునర్జన్మ జ్ఞప్తి వచ్చినవాడు తన పూర్వ వృత్తాంతమును చెప్పుటయూ, దానిని విచారించితే అంతా నిజమని తెలియుటయూ జరుగుచున్నది. అలా జరుగుట వలన మనకు పునర్జన్మలున్నాయనుటకు ఆధారము దొరుకు చున్నది. అదే విధముగా ఎన్నో సూక్ష్మ, స్థూల గ్రహములు ఖగోళములో ఉండినప్పటికీ, అవి మనకు తెలియనివి ఎన్నో రకములున్నవి. తెలియనివి కూడా ఉన్నాయనుటకు ఆధారముగా ఎవనికో ఒకనికి పునర్జన్మ జ్ఞాపకము వచ్చినట్లు, ఎప్పుడో ఒకప్పుడు ఫ్లయింగ్ సాసర్స్ కనిపించడమూ, ఏలియన్స్ కనిపించడమూ జరుగుచున్నది.

ఫ్లయింగ్ సాసర్స్ ఎంతో కాలమునుండి కనిపించుచున్నవని తెలియుచున్నది. ఫ్లయింగ్ సాసర్స్‌గానీ, ఏలియన్స్‌గానీ ఎక్కువగా అమెరికా ఖండములోనే కనిపించడము విశేషము. బహుశా 1940వ సంవత్సరములో అనుకుంటాను, అమెరికాలో ఫ్లయింగ్ సాసర్స్‌ను గురించిన ఒక సంఘటన జరిగింది. అదేమనగా! అంతకుముందు ఎన్నో మార్లు ఎగిరేపళ్ళెములను చూచిన అమెరికావారు, అవి ఏమిటి? ఎక్కడినుండి వస్తున్నవి, వాటిలో ఎవరున్నారు? అను విషయములు తెలుసుకోవాలనుకొన్నారు. అటువంటి సందర్భములో ఒకరోజు ఎగిరే పళ్ళెములు వారికి కనిపించాయి. వెంటనే అమెరికా ఎయిర్‌పోర్సుకు సంబంధించిన నాలుగు యుద్ధవిమానాలు బయలుదేరి వాటిని వెంబడించాయి. ఎటు తిరిగి వాటిని బలవంతముగా క్రిందికి దించడముగానీ, అట్లు వీలుగాని సమయములో కూల్చివేయడము గానీ చేయవలెననునది యుద్ధవిమానాల ఉద్దేశము. ఆ ఉద్దేశముతో విమానములు ఫ్లయింగ్ సాసర్స్‌కు దగ్గరగా పోయాయి. విమానములు పూర్తిగా వాటిని సమీపించినపుడు, ఆ ఫ్లయింగ్ సాసర్స్ నుండి నీలిరంగు గల పొగ బయటికి వచ్చింది. ఆ పొగ తర్వాత అవి కనిపించకుండా పోయాయి. నీలిరంగు పొగవచ్చినపుడు, పొగ వాటిని కనిపించకుండా చేసింది. పొగ తర్వాత అవి పూర్తిగా కనిపించకుండా పోయాయి. ఎంత ప్రయత్నము చేసినా ఫలితము లేకుండా పోయింది, వాటి వివరము తెలియకుండా పోయింది. తర్వాత వాటిని గురించిన పూర్తి సమాచారము ఇంతవరకు దొరకలేదు. కొందరు ఫ్లయింగ్ సాసర్ కూలిపోయిందని చెప్పినా అది అబద్ధము. అట్లు కూలిపోవడము ఇంతవరకు ఎక్కడా జరుగలేదు. ఫ్లయింగ్ సాసర్ ఒకయంత్రముగానీ, వాహనముగానీ కాదు. అది సజీవమైన చిన్నపాటి గ్రహము. అందువలన అది కూలిపోవుటకు వీలులేదు. ఫ్లయింగ్ సాసర్ అనునది ఒక ఎగిరే పళ్ళెములాగ కనిపిస్తే దానిని ఒక యంత్రము లాగా పోల్చుకోవడము

పొరపాటు.  ఆ గ్రహము యొక్క ఆకారము పళ్ళెములాగ ఉండడము వలన, దానిని మనుషులు పొరపాటుగా ఒక వాహన యంత్రమనుకొన్నారు.  ఫ్లయింగ్ సాసర్స్ అనబడు ఆ గ్రహములు, మానవుని పాపములను అమలు జరుపడములో తనవంతు కార్యమును చేయుటకు,  నిత్యము ఎన్నో భూమిమీదికి రావడము జరుగుచున్నది.  మానవుని ఒక రకమైన పాపమునకు తగినట్లు శిక్షను అమలు చేయుటకు ప్రత్యేకముగానున్న ఫ్లయింగ్ సాసర్స్  భూమిమీదికి నిత్యమూ అనేక చోట్లకు వస్తున్నవని ఎవరికీ తెలియదు.  మనిషికి ఎంత మేధస్సు ఉండినా, ఎంత హెూదా ఉండినా, ఎంత ధనమున్నా, ఎంత విద్య ఉండినా  తన పాపపుణ్యములు తన మీద ఎట్లు అమలగుచున్నవో ఎవరికీ తెలియదు.  పాపము అమలగు విధానము కొంతకు కొంత తెలియాలంటే,  అతను ఆధ్యాత్మిక విద్యలో ఆరి తేరి ఉండాలి.  ఆధ్యాత్మికము తెలియనివానికి, వానికే వాడు తెలియడు.  వానికి వాడే ఏమిటో తెలియ నపుడు, వాని కర్మను గురించి వానికి అసలుకే తెలియదు. అటువంటపుడు కర్మ ఎలా వస్తున్నదో, పాపము ఎట్లు తనను చేరుచున్నదో,  చివరికది ఏ రూపములో, ఎవరి ద్వారా అమలుకు వస్తుందో తెలియదు.  ఆ విధానములో  ఫ్లయింగ్ సాసర్స్ మన పాప పరిపాలకులలో భాగస్తులని కూడా తెలియదు.